

బెడ్‌పై ఉన్న వ్యక్తి వద్ద అర్జీని స్వీకరించి, సమస్య పరిష్కరించాలని సిఫార్సు చేస్తున్న సీఎం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చంద్రబాబు

కార్యకర్త కుమారుడికి నామకరణం

శాంతిపురం మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శివ తన చిన్నారిని తీసుకుని సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆయన ఆ చిన్నారికి ఆర్‌ఎస్ జితేంద్ర అని నామకరణం చేసి, ఆశీర్వదించారు.

- ఈ మూడు సూత్రాలతో కుప్పం అభివృద్ధి
- నావంతుగా రూ.550 కోట్లు పెడుతున్నా
- సద్వినియోగం చేసుకోవడం మీవంతు
- రెండో రోజు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆరోగ్యం.. ఆదాయం.. ఆనందం

'హెల్తీ, వెల్తీ, హ్యాపీ అనే మూడు సూత్రాలతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం నా లక్ష్యం. ఇందుకోసం రూ.550 కోట్లతో వివిధ పరిశ్రమలకు, పథకాలకు ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాను. ఈ పనులన్నీ మీకోసమే. సద్వినియోగం చేసుకోవడం మీ చేతుల్లోనే ఉంది.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో రెండో రోజైన మంగళవారం ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడమే కాకుండా ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాల అనంతరం లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..



కంగుందిలో మాట్లాడుతూ..

● కుప్పంలో జనాభా, నైపుణ్యం రెండూ పెరగాలి

కుప్పంలో జనాభా రానురాను తగ్గిపోతోంది. జనాభా పెరగడంతోపాటు, యువతలో నైపుణ్యం కూడా పెంచాలి. ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్ అందాలి. మనం నెక్ట్స్ లెవెల్‌కు వెళ్లాలి. సంపద సృష్టించి, తలసరి ఆదాయం పెంచాలి. అందుకు అవసరమైన ప్రణాళికలు నేను తయారు చేయించాను. మీరు వాటిని ఉపయోగించుకుని సర్వతోముఖాభివృద్ధి చెందాలి.

● నాలుగు అంశాలే ప్రధానం

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నాలుగు అంశాలే ప్రధానం. పేదరిక నిర్మూలన, ఆర్థిక స్థితిగతుల ఉన్నతి, ఉద్యోగ ఉపాధి కల్పన, జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్‌మెంట్). ఈ నాలుగు అంశాలే ప్రధానంగా స్వర్ణ కుప్పం విజన్ డాక్యుమెంట్ 2029 తయారైంది. యువతలో, మహిళల్లో నైపుణ్యాలను శిక్షణ ద్వారా పెంచి, ఉద్యోగ, ఉపాధి కల్పన చేయడం ద్వారా ఈ నాలుగు అంశాలను సాధించే అవకాశం ఉంది. ఆ దిశగానే నేటి అభివృద్ధి కార్యక్రమాలు రూపొందాయి. కడా బాగా పనిచేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలను, వివిధ రకాల ఏజెన్సీలను కుప్పం పిలిపించి ఒప్పందాలు చేయించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయితే ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త తయారవుతారు. మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థాయికి ఎదుగుతారు.

● మిమ్మల్ని అందరినీ పైకి తేవాలని

నా ప్రయాస అంతా మిమ్మల్ని అందరినీ పైకి తేవాలనే. లేదు, మేము ఇట్లానే ఉంటామంటే నేను ఏమీ చేయలేను. 2047 నాటికి దేశంలోనే కుప్పం ఆదర్శంగా నిలవాలి. ఉద్యోగాలు, స్వచ్ఛమైన పరిసరాలు వెదుక్కుంటూ బెంగళూరు కాదు, అందరూ ఇక్కడికే రావాలి. అలా టూరిజం హబ్‌గా, ఎడ్యుకేషన్ సెంటర్‌గా తయారు చేస్తా. ఇంటినుంచే పనిచేసేలా పలు ఐటీ కంపెనీలతో మిమ్మల్ని అనుసంధానం చేస్తా. ఇంటినుంచి కుదరకపోతే వర్క్‌స్టేషన్లు ఏర్పాటు చేసి, అక్కడినుంచి పనిచేసే వాతావరణం కల్పిస్తా.

● మెడికల్ ఇంటిగ్రిటీ

ప్రజారోగ్యం చాలా ముఖ్యం. ఆరోగ్యంగా ఉంటేనే ఏపని అయినా సాధించగలం. అందుకోసం మెడికల్ ఇంటిగ్రిటీ తీసుకొస్తాను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ ఇక్కడికి వచ్చారు. ఆయనతో ఇప్పుడే చర్చలు జరిపాను. కోలార్ జిల్లాలో మెడికల్ ఇంటిగ్రిటీని వారు తీసుకొచ్చారు. అదే తరహాలో టాటా మెడికల్ సైన్సెస్ ద్వారా చిత్తూరు జిల్లాలో మెడికల్ ఇంటిగ్రిటీ తీసుకొస్తాను. అంటే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను అనుసంధానం చేస్తాను. తద్వారా ప్రతి ఒక్కరి మెడికల్ రికార్డు ఆన్‌లైన్ ద్వారా నమోదవుతుంది. ఎవరికి ఏ వైద్య సాయం అందాలన్నా క్షణంలో పొందే అవకాశం ఉంటుంది. ఈ మెడికల్ ఇంటిగ్రిటీని మొదట కుప్పం నుంచే ప్రారంభిస్తాను. తర్వాత చిత్తూరు జిల్లాకు, ఆపైన రాష్ట్రానికి విస్తరిస్తాను. కుప్పం నాకు ఒక ప్రయోగశాల. ఏ ప్రతిష్ఠాత్మక పథకమైనా ఇక్కడినుంచే ప్రారంభించి.. రాష్ట్రమంతటా విస్తరించడం ఒక విధానంగా అమలు చేస్తున్నాను. దీనితోపాటు స్వచ్ఛ సమాజం కూడా తీసుకొస్తే కుప్పం ప్రజల ఆయుష్షు సాధారణంకంటే మరో 20-30 ఏళ్లు పెరుగుతుంది.

- కుప్పం, ఆంధ్రజ్యోతి



'జన నాయకుడు' అర్జీ ఫారాన్ని స్వయంగా పరిశీలిస్తూ..



సిద్ధమైన 'జననాయకుడు' కౌంటర్లు

● మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి

మనకు ఘనమైన సంస్కృతీ సంప్రదాయాలున్నాయి. ఇప్పుడే పిల్లలు ఇక్కడ కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. వారిని అభినందిస్తున్నాను. అందుకే నేను కూడా విజయవాడ ఎయిర్‌పోర్టు వద్ద కూచిపూడి నృత్య దృశ్యాలతో అలంకరణ చేయించాను. పిల్లలే వారసత్వాన్ని ముందు తరాలకు అందించే వారధులు. ఇక్కడ కళలను ప్రదర్శించేందుకు ఒక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం కావాలని అడిగారు. అది కూడా తీసుకు వస్తా. సాయంత్రం వేళ మీరంతా ఇళ్లనుంచి వెలుపలికి వచ్చి ఒకరితో ఒకరు కలిసి ఆనందంగా గడిపే వాతావరణం సృష్టిస్తాను.

● విమానాల మరమ్మతు స్టేషన్

కుప్పంలో త్వరలోనే విమానాశ్రయం వస్తోంది. ఇక్కడి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల రవాణాకోసం కార్గోతోపాటు డొమెస్టిక్ విమానాశ్రయం కూడా రూపుదాలుస్తుంది.మీరు కూడా విమానం ఎక్కి, ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఈ విమానాశ్రయం దగ్గరే విమానాలను రిపేరు చేసే వర్క్ స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటాను.విమానాశ్రయం, వర్క్ స్టేషన్ వల్ల ప్రత్యక్షంగానే కాక, పరోక్షంగా వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

● బెంగళూరును కలిపేలా అవుటర్ రింగ్ రోడ్డు

రోడ్లు నిర్మిస్తే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. తద్వారా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అందుకే నేను రోడ్ల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టాను. నియోజకవర్గ పరిధిలోని రోడ్ల నిర్మాణం, ఆధునీకరణ, విస్తరణతోపాటు కుప్పాన్ని బెంగళూరుతో కలిపేలా అవుటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాను. హోసూరు పక్కనుంచి వెళ్లే ఈ అవుటర్ రింగ్ రోడ్డు వల్ల కుప్పం-బెంగళూరు కనెక్టివిటీ పెరుగుతుంది.

● ఆలయాల అభివృద్ధి

కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రధానంగా నాలుగు ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాను. కుప్పం పట్టణంలోని కొత్తపేటలో మూడు అంతరాలయాలను రూ.8కోట్లతో, కుప్పం మండలం బేటరాయస్వామి ఆలయాన్ని రూ.2.66 కోట్లతో, గుడుపల్లె మండలం మల్లేశ్వరస్వామి ఆలయాన్ని రూ.3.80 కోట్లతో, రాళ్లగంగమ్మ ఆలయాన్ని రూ.7కోట్లతో అభివృద్ధి చేస్తాను.

● కష్టానికి సాంకేతికత అనుసంధానం

మీకు కష్టపడే స్వభావం ఉంది. అయితే ఈ కష్టం, చాలావరకు వృథాగా పోతోంది. అందుకే మీ కష్టానికి సాంకేతికతను అనుసంధానం చేస్తాను. టెక్నాలజీతో మీ జీవితాల్లో వెలుగులు విరజిమ్మేలా చేస్తాను.

● మూడు నెలల తర్వాత మళ్లీ వస్తా

ఇప్పుడు ఏయే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానో, అవన్నీ ఈ మూడు నెలల్లో ఒక స్టేజీకి వస్తాయి. నేను మూడు నెలల తర్వాత మళ్లీ వస్తాను. అప్పుడు అభివృద్ధిని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకువెళ్తాను.

ప్రజల విన్నపాలు విన్నారు..

నాయకులకు చురకలు అంటించారు!

కుప్పం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జననాయకుడు పోర్టల్ ప్రారంభించడంతోపాటు వేలాదిగా తరలివచ్చిన నియోజకవర్గ ప్రజల విన్నపాలను సీఎం సావధానంగా విన్నారు. వారినుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో తనను ఇన్‌ఫ్లుయన్స్ చేయడానికి ప్రయత్నించవద్దంటూ ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు చురకలు అంటించారు. మొత్తం 1,090 మంది ప్రజలు వివిధ సమస్యలపై సీఎంకు అర్జీలు సమర్పించారు. తాను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా మూడు బాధ్యతలు కుప్పంలో నిర్వహిస్తున్నానని చంద్రబాబు అన్నారు. అందువల్ల ఆ మేరకు అర్జీలను వేర్వేరుగా చేసి, ఎక్కడికి చేర్చాల్సిన వాటిని అక్కడికి చేర్చాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, శాప్ చైర్మన్ రవినాయుడు, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటూ..

తేలనున్న పింఛన్ల లెక్క



చిత్తూరులో జరిగిన తనిఖీలో పాల్గొన్న అధికారుల బృందం

● ప్రారంభమైన గుర్తింపు సర్వే ● జిల్లాలో 10 బృందాలుగా తనిఖీలు ● నకిలీ పింఛన్ల తొలగింపునకు చర్యలు

చిత్తూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకున్నా వైకల్య ధ్రువపత్రాలతో పింఛన్లు అందుకుంటున్న వారి వివరాలను జల్లెడ పట్టేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పింఛను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేపడుతోంది. సర్వే బృందంలో ఆర్థో డాక్టర్, జనరల్ మెడిసిన్ డాక్టర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, గ్రామస్థాయి అధికారులు సభ్యులుగా ఉన్నారు. కొన్ని మండలాల్లో ఈనెల 6 నుంచే తనిఖీ ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా రూ.15వేలు తీసుకుంటున్న వారి వివరాలపై దృష్టిపెట్టారు.

పక్కాగా తనిఖీ చేస్తున్నాం



వైద్య బృందం పక్కాగా తనిఖీలను నిర్వహిస్తోంది. వారంలో మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి మిగిలిన రోజులు వారు రెగ్యులర్ విధులు నిర్వహిస్తారు. మూడు వారాల్లో రూ.15వేల పింఛన్ల తనిఖీ పూర్తవుతుంది. రెండో విడతగా దివ్యాంగుల పెన్షన్లపై సర్వే జరుగుతుంది.

-సుధారాణి, డీఎంహెచ్‌వో

రూ.15వేల లబ్ధిదారులు 1,936 మంది

జిల్లాలో రూ.15వేల పింఛను పొందుతున్న వారు 1,936 మంది ఉన్నారు. బృంద సభ్యులు పరిశీలించిన వివరాలను ప్రభుత్వ యాప్‌లో నమోదు చేస్తారు. సర్వే మూడు వారాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వారంలో సోమ, మంగళ, బుధవారాల్లో బృందం తనిఖీలు చేస్తారు. ఇప్పటివరకు చిత్తూరు అర్బన్, ఐరాల, గంగవరం, రామకుప్పం, సోమల మండలాల్లో 10 టీములు తనిఖీలు ప్రారంభించి 361 మందిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. రెండో విడతలో 35374 మంది దివ్యాంగుల పింఛను లబ్ధిదారుల వివరాలను పరిశీలించనున్నారు. అనర్హులు ఉంటే వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తారు. ధ్రువపత్రం మంజూరు చేసిన వైద్యాధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. తనిఖీలు పూర్తయ్యే వరకు సదరం కొత్త స్లాట్లు, రూ.15వేల పింఛను ధ్రువపత్రాల జారీ ప్రక్రియను ఆపాలని ఆదేశాలు అందినట్లు సమాచారం.


నేటితో ముగియనున్న రెవెన్యూ సదస్సులు

చిత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారం ముగియనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం డిసెంబరు 6 నుంచి ప్రతిష్ఠాత్మకంగా ఈ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. మంగళవారం నాటికి 774 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయన్నారు. 33,965 మంది రైతులు పాల్గొన్నారని, వెయ్యి అర్జీలు అందజేశారన్నారు. 40 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. మంగళవారం ఒక్క రోజే 25 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 79 అర్జీలు అందాయని ఆయన వివరించారు.

భయం వద్దు

- జాగ్రత్త పడితే చాలు
- కలకలం రేపుతున్న చైనా కొత్త వైరస్

లక్షణాలిలా.. : కరోనా వచ్చినప్పుడు ఎలాంటి లక్షణాలను గుర్తించామో ఇప్పుడు కూడా అలాంటివే ఉంటాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. జలుబు, ముక్కుదిబ్బడ, గొంతు నొప్పి, దగ్గు, సాధారణ జ్వరం వంటి లక్షణాలు హెచ్‌ఎంపీవీలోనూ కనిపిస్తాయి. తుమ్ములు, దగ్గు ద్వారా ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది.



'కరోనా వైరస్ లాంటిదేదో బెంగళూరు, చెన్నై వరకు వచ్చేసింది. మళ్లీ లాక్‌డౌన్‌లు పడతాయేమో? అందరం ఇంటికే పరిమితమవ్వాల్సిందేనేమో?వంటి ఊహాగానాలు ప్రజల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఏ నలుగురూ జతకూడినా రోజుకొక్కసారైనా కొత్త వైరస్ గురించి మాట్లాడుకుంటున్నారు. కరోనా తాలూకా అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. కాగా, నిన్న మొన్నటి వరకు ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్, ఇప్పుడు హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమోవైరస్) కలకలం రేపుతోంది. చైనా నుంచి దిగుమతైన హెచ్‌ఎంపీవీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అలాంటి భయాందోళనలు అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అందుకే జిల్లా వైద్య యంత్రాంగం కూడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా కొత్త వైరస్‌పై లైట్ తీసుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆందోళన వద్దు..అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు

హెచ్‌ఎంపీవీ వలన ఇప్పటికప్పుడు ఆందోళన చెందాల్సిన పనిలేదు. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు. కొత్త వైరస్ కాబట్టి ఇమ్యూనిటీ ఉంటుంది. వ్యాధినిరోధక శక్తి లేనివాళ్లకు శ్వాసకోస సంబంధిత ఇన్‌ఫెక్షన్ ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ఓ కంటకనిపెడుతూ ఉండాలి. అనుమానం వస్తే వైద్యుల్ని సంప్రదించాలి. శ్వాసకోస వ్యాధి కేసుల అడ్మిషన్లు పెరుగుతుంటే హెచ్‌ఎంపీవీ సోకిందేమోనని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సాధారణ స్థితిలోనే కేసులు ఉన్నాయి. జలుబు, దగ్గు ఉన్నా.. జన సమూహాల్లోకి వెళుతున్నా.. ముక్కు, నోటికి కలిపి మాస్కులు పెట్టుకోవడం చాలా ఉత్తమం. సాధారణ వ్యాధి లక్షణాలు కనబడితే ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలి.



- డాక్టర్ సుబ్బారావు, పల్మనాలజిస్ట్, రుయాస్పత్రి





ఆలయ శుద్ధి


తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో.. మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించారు. టీటీడీ చైర్మన్, బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెంటాడి.. గంజాయి వాహనం పట్టివేత

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు సినీఫక్కీలో వెంటాడి పట్టుకున్నాయి. వైజాగ్ నుంచి గంజాయితో ఓ కారు కోట మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంబడించడంతో గంజాయి వాహనం కడివేడు మీదుగా వెళ్లిపోయింది. కోట మండలంలోని విద్యానగర్, చంద్రశేఖర్‌పురం, చిట్టేడు, కేశవరం, కొండుగుంట మార్గాల్లో వెళుతున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంటాడాయి. విద్యానగర్‌లోని పెట్రోల్ బంకు వద్ద స్థానిక యువకులు ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో గంజాయి వాహనం ఆగిపోయింది. పోలీస్, టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఆ కారులో సుమారు 80కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 54,180

తలనీలాలు సమర్పించినవారు: 17,689



సొంత ట్యాంకర్‌తో మొక్కలకు నీటిని పడుతున్న శ్యామ్



నరశింగరావుపేట ప్రాంతంలోని రెల్వేస్టేషన్ గోడ ఆనుకుని శ్యామ్ నాటిన మొక్కలు

మొక్కవోని లక్ష్యం

● గ్రీన్ మ్యాన్ గూడూరు శ్యామ్‌కుమార్‌రెడ్డి



మొక్కల పెంపకం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వరిస్తున్నారో వ్యక్తి. గూడూరులోని షాదీమంజిల్ సమీపాన నివాసముంటున్న మద్దాలి శ్యామ్‌కుమార్‌రెడ్డి ప్రైవేటు కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వృత్తితోపాటు నిరంతరం తన ప్రవృత్తి కూడా నిర్వర్తిస్తున్నారీయన. 22 ఏళ్లుగా పట్టణంలోని వీధుల్లో, కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద మొక్కలను నాటుతున్నారు. పచ్చదనం పరిరక్షణ కోసం మోడుమారుతున్న మొక్కలకు ప్రాణం పోస్తున్నారు. తానే ట్రక్కుఆటో కొని వాటర్‌క్యాన్‌లో నీటిని నింపుకుని తీసుకువెళ్లి మొక్కలకు పోసి కన్నబిడ్డల్లా సాకుతున్నారు. ఈయన నాటిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. తుపాన్లలో నేలకొరిగిన వాటినీ నిలబెట్టి ప్రాణం పోస్తూ కాలుష్యరహిత సమాజానికి తనవంతు కృషిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మొక్కలు పెంచడం ఎంతో ఇష్టమని చెబుతారు శ్యామ్‌కుమార్‌రెడ్డి. పొగడ, కానుగ, వేప, మర్రి, నేరేడు, బాదం, దేవగన్నేరి, టెంపుల్, మారేడు తదితర ఎన్నో రకాల మొక్కలను నాటారు. మొదట్లో వెయ్యికి పైగా మొక్కలను స్వయంగా నాటి రోజూ నీరు పోసేవారు. ఈయనలోని సామాజిక దృక్పథాన్ని గమనించిన కొందరు దాతలు ముందుకొచ్చారు. మొక్కల కోసం ట్రీగార్డులను అందజేయడం ప్రారంభించారు. ఈయన ప్రయత్నానికి చేదోడుగా నిలిచారు. ఇప్పటికే 5వేలకు పైగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు శ్యామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో పచ్చదనం వ్యాప్తికి శ్యామ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)



తుపానులో కూలిపోయిన టెంపుల్‌ట్రీ చెట్టును నిలబెట్టి.. ప్రాణం పోశారు ఇలా..

చెడిపోయిన మాంసం

● కుళ్లిన కూరగాయలు
● ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో విస్తుపోయే నిజాలు
● 14 హోటళ్లలో తనిఖీలు చేసి నోటీసులు జారీ
● చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర డైరెక్టర్ పూర్ణచంద్రరావు



తిరుచానూరు వద్ద ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 10 బృందాలుగా ఏకకాలంలో దాడులు చేశాయి. నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిలిఇంచారు. తిరుచానూరు వద్దనున్న ఓ హోటల్‌లో కుళ్లిపోయి, గడ్డకట్టిన్న మాంసాన్ని డీప్ ఫ్రిడ్జిలో ఉంచడం బయటపడింది. అనుమతుల్లేని ఎసెన్స్‌లు వాడుతున్నట్లు చర్తించారు. చెడిపోయిన టమోటాలతో చట్నీ, సాస్‌ల తయారీ.. చికెన్ కబాబ్ తదితరాలను మళ్లీ వేడి చేసి కస్టమర్లకు వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లలో ఇలాగే చేస్తారా అంటూ సిబ్బందిని నిలదీశారు. రేణిగుంట రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో మూడు నెలల క్రితం కాలపరిమితి దాటిన ఊరగాయల బాటిళ్లను, చెడిపోయిన నూడుల్స్, పుట్టగొడుగులు, చికెన్ కబాబ్‌ను గుర్తించారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంటులోని కొన్ని ఆహార పదార్థాల్లో రంగు, రుచి కోసం వాడుతున్న కలర్లు డూప్లికేట్‌వి గుర్తించారు. నగరంలోని మరో హోటల్‌లో కాలపరిమితి ముగిసిన రోటీలు, బ్రెడ్లు, పుట్టగొడుగులు బయటపడ్డాయి. ఇంకో హోటల్‌లో గోబీ మంజూరి, జాంగ్రీ చెడిపోయి వుందని తనిఖీ అధికారులు చెప్పారు. ఇంకో హోటల్‌లో పురుగులు పట్టిన అలసందలు, నువ్వులు, కొన్ని ఆహార పదార్థాలను సీజ్ చేశారు. మరో హోటల్‌లో ఫ్రిడ్జి పనిచేయక ఆహార పదార్థాలు, పెరుగు చెడిపోయిందని, వీటిని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగులు కలిపిన కందిపప్పు చెడిపోయిన జీడిపప్పు, పుట్టగొడుగులు ఉన్నట్లు ఇంకో హోటల్ తనిఖీల్లో బయటపడింది. ఇంకో హోటల్‌లో తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తనిఖీ చేయగా.. వండి నిల్వ వుంచిన ఆహార పదార్థాలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం కొన్ని హోటళ్ల, తోపుడు బండ్లపై టిఫిన్లు, వివిధ రకాల తినుబండారాలను తనిఖీ చేశారు. ఆయా తనిఖీల్లో కర్నూలు ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాలరావు, తిరుపతి నుంచి మద్దిలేటి, జగదీష్, సుమన్, చిత్తూరు నుంచి శ్రీనివాస్, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌కు పంపి చర్యలు తీసుకుంటాం

మా తనిఖీల్లో బయటపడిన ఆహార పదార్థాలు, ముడిసరుకులను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. ఎవ్వరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదు. ల్యాబ్‌కు పంపిన బిర్యానీ, వివిధ ముడిపదార్థాలు, సరకుల్లో లోపాలుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అన్ని హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తుండట్లాన సీరియస్‌గా తీసుకుంటున్నాం.

- పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్

రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన 27 రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించామని పేర్కొన్నారు.

18 నుంచి పక్షుల పండుగ

● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి ● విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఆదేశం



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

తడ/సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఈ 18వ తేది నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించాలని నిర్ణయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి మంగళవారం ఆయన దొరవారి సత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని, సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప వద్ద పులికాట్ సరస్సు, వన్యప్రాణి విభాగం విజ్ఞానకేంద్రం, జూనియర్ కళాశాల మైదానం, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవును పరిశీలించారు. పండుగ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధుల సూచనలను స్వీకరించారు. సూళ్లూరుపేటలోని ఓ కల్యాణ మండపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోను.. పర్యటనల్లోనూ ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించలేదని, ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. 18వ తేది శనివారం శోభాయాత్రతో ఈ పండుగ ప్రారంభమవుతుందని నేలపట్టు, అటకానితిప్పల్లో పక్షులను వీక్షించడం, భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తామని వివరించారు శ్రీసిటీలోనూ కార్యక్రమాలు నిర్వహించేలా నిర్ణయించామన్నారు. పర్యాటకుల కోసం పడవలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఏర్పాట్లు చేయడానికి తన అధ్యక్షతన 16 మంది అధికారులతో పండుగ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పక్షుల పండుగ నేపథ్యంలో నేలపట్టుకు గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్పకు డీఆర్‌డీఏ పీడీ, భీములవారిపాళెం మత్స్యశాఖ ఏడీ, శ్రీసిటీకి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, సూళ్లూరుపేట కార్యక్రమాలకు డ్వామా పీడీలను ఇన్‌చార్జులుగా నియమించామన్నారు. జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఆయన మీడియాతోనూ మాట్లాడారు. మన ప్రాంతంలో జరిగే పక్షుల పండుగను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, డీఆర్వో నరసింహులు, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణశాఖ డీఎఫ్‌ఓ హారిక, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, డీవీఎం శ్రీనివాసరావు, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, మత్స్యశాఖ ఏడీ నాగరాజు, ఆయా మండలాల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

వినియోగదారులపై ఆర్థిక భారం తగదు



ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలపైనే ఏపీఈఆర్‌సీ ఆర్థికభారాన్ని మోపడానికి దిగడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నేత కందారపు మురళి పేర్కొన్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన వర్చువల్‌గా తన వాదన వినిపించారు. ప్రజాభిప్రాయ సేకరణలు చేపట్టినా చివరకు ప్రభుత్వాల ఆదేశాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. చార్జీలు పెంచడానికి ఇచ్చిన అనుమతులే ఇందుకు నిదర్శనమన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందం, స్మార్ట్ మీటర్లు అమర్చడం వంటివి నియంత్రణ మండళ్ల నిస్సహాయతకు సాక్ష్యాలని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ32 వేల కోట్ల భారాన్ని మోపితే, కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రూ.16 వేల కోట్లు భారాన్ని వినియోగదారులపై మోపడం అన్యాయమని తెలియజేశారు. ప్రభుత్వాలు 25 ఏళ్లకు ఒప్పందాలు చేసుకోవడం, ఒక యూనిట్ విద్యుత్ కూడా కొనుగోలు చేయకుండా లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉత్పత్తిదారులకు చెల్లించడాన్ని రద్దు చేయాలన్నారు. సెకీ, అదానీల ఒప్పందాలను రద్దు చేసి తిరిగి టెండర్లను ఆహ్వానించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు, ఈఈ వి.చంద్రశేఖర్ రావు, వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

2,770 సీసీ కెమెరాల నిఘాలో వైకుంఠద్వార దర్శనాలు

● 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు
● 9న ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు



తిరుపతిలో క్యూల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో గౌతమి, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు వచ్చే భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం 2,770 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. తిరుపతిలో సర్వదర్శన టోకెన్లు జారీ చేసే కేంద్రాల్లోనూ 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

వైకుంఠద్వారదర్శనం టోకెన్లు ఇచ్చే కేంద్రాలు

తిరుపతిలో: ఇందిరామైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్‌పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఈ కేంద్రాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ కేంద్రాల్ల వద్ద గూగుల్ లొకేషన్ మ్యాప్స్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో : కమ్యూనిటీ హాల్‌లోని 4 కౌంటర్లలో.

వసతి ఏర్పాట్లు: పదిరోజుల పాటు తిరుమలలో వసతి ఆన్‌లైన్ బుకింగ్ రద్దు. సామాన్య భక్తులకు మాత్రం సీఆర్వోలో గదులు కేటాయిస్తారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజీ డోనార్ స్కీం అలాట్మెంట్ కౌంటర్లు మూసివేస్తారు.

పార్కింగ్: తిరుమలలో 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎంబీసీ, ఔటర్ రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. టికెట్లపై ఎంట్రీ పాయింట్, అలైటింగ్ పాయింట్, పార్కింగ్, పికప్ పాయింట్ల వివరాలు ముద్రిస్తారు.

ఇతర నిర్ణయాలు

● దర్శన టోకెన్లు కలిగిన భక్తులకే క్యూలైన్‌లోకి అనుమతి. ● జనవరి 9వ తేదీకి అదేరోజుకు ఇచ్చే ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు. ● శ్రీవారిమెట్టు మార్గంలో టోకెన్ జారీ కౌంటర్లు జనవరి 19వ తేదీ వరకు మూసివేత. ● వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. ● భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా మంచినీరు, అన్నప్రసాదాల పంపిణీ. అన్నప్రసాద కేంద్రాలతో పాటు ఫుడ్‌కౌంటర్ల ద్వారా సాంబారన్నం, పాలు, టీ, స్నాక్స్, మంచి నీరు పంపిణీ. ● 3 వేల మంది యువ శ్రీవారిసేవకులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు. ● 2,082 మంది సిబ్బందితో పారిశుధ్యం. అదనంగా 150 కేటాయింపు.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీ వద్ద మంగళవారం వేకువజామున ఓ కారు కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాలేనికి చెందిన ఎ.ప్రశాంత్ మంగళవారం తెల్లవారుజామున తిరుపతి నుంచి రేణిగుంటకు వెళుతున్నారు. ఆ సమయంలో కరకంబాడి రోడ్డులో కారు అదుపు తప్పి పక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వెనకే ఉన్న ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు, నుజ్జు అయింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కాగా, నిద్ర.. మద్యం మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి చెప్పారు.



చెరకు కూలీలపై దూసుకెళ్లిన కంటైనర్

● ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



చెరకు కూలీలను ఢీకొన్న కంటైనర్

నారాయణవనం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెరకు కట్టలు పేర్చుతున్న కూలీలపైకి కంటైనరు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. నారాయణవనం మండలంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నైనారు కండ్రిగ వద్ద చెరకు తోటలో చెన్నైలోని విల్లుపురానికి చెందిన రాజన్(55), తనికవేలు ఉదయం 6 గంటల ప్రాంతంలో చెరకు గడలను తీసుకొచ్చి రోడ్డుపై పేర్చుతున్నారు. చెన్నై నుంచి తిరుపతి వైపుగా వస్తున్న లారీ కంటైనర్ నేరుగా వారిని ఢీకొట్టింది. పేర్చిన చెరకు గడలకు, లారీకి మధ్యలో రాజన్ నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తనికవేలు తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో యూజీసీ బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగాన్ని యూజీసీ బృందం పరిశీలించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దూరవిద్య విభాగం నిర్వహణ, కోర్సులు, బోధన, విద్యార్థులు, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సిబ్బంది, పనితీరు వంటి పలు వివరాలను పరిశీలించారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా విభాగ అభివృద్ధి, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. దూరవిద్య పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సెనేట్ హాల్లో సమావేశమై పలు వివరాలను తెలుసుకున్నారు. డీఎస్టీ పర్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ బృందంతో ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర, ఆచార్య అరింద్ రనడే, యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ వినోద్ సింగ్ యాదవ్ ఉన్నారు. వీరికి దూరవిద్య ప్రగతిని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, దూరవిద్యా డైరెక్టర్ తవమణి వివరించారు. ఈ పర్యటన తర్వాత దూరవిద్యకు గుర్తింపును ప్రకటించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యను పరిశీలిస్తున్న యూజీసీ బృందం





ఎన్టీఆర్ స్టేడియం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, హాజరైన జనం



1ఎం1బీ కెరీర్ రెడీనెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి

ద్రావిడ వర్సిటీని ఎంతో అభివృద్ధి చేశా

వసతి గృహం, తరగతి గదుల భవన సముదాయం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

గుడుపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో రూ.249.62 లక్షలతో నిర్మించిన వసతి గృహం, రూ.10 కోట్లతో నిర్మించిన తరగతి గదుల భవన సముదాయాన్ని మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అలాగే 1ఎం1బీ కెరీర్ రెడీనెస్ సెంటర్‌కు కూడా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని తాను ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. ద్రావిడ భాషా సంస్కృతులకు నిలయమైన ఈ విశ్వవిద్యాలయం ఐదేళ్లలో రాజకీయ పునరావాసానికి కేంద్రంగా మారిందని విమర్శించారు.

ఉపాధి కోర్సులు

రాబోయే ఐదేళ్లలో ఎన్నో ఉపాధి, ఉద్యోగ కల్పన కోర్సులు ప్రవేశపెట్టి యువతకు దారి చూపుతామని సీఎం హామీ ఇచ్చారు. ద్రావిడ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యను కూడా కొలిక్కి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ దొరస్వామినాయుడు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బాబునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు అమీర్, ఎర్రా బాలచందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం తర్వాత విశ్వవిద్యాలయం ఎమినో హౌస్ సమావేశ మందిరంలో అధికారులతో సీఎం సమీక్షించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ చేరుకుని రాత్రి బస చేశారు.





స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి ప్రారంభోత్సవం చేసిన సీఎం చంద్రబాబు - స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు పంపిణీ చేస్తూ..

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పంపిణీలు

కుప్పం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయన సమక్షంలో కడా పీడీ, వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలు, ముఖ్యమంత్రి సహాయ నిధికింద పంపిణీలు చేశారు.

- మదర్ డెయిరీ ఫ్రూట్ అండ్ వెజిటబుల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె వద్ద కేటాయించిన 41.22 ఎకరాల భూమిలో 105.10 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోయే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన. పండ్ల గుజ్జు (టమోటా, మామిడి) తయారుచేసే ఈ ప్లాంటు ద్వారా 50వేల మంది రైతులకు ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనం.
- అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా (అలీప్)తో ఒప్పందం. శాంతిపురం తమ్మిగానిపల్లె వద్ద మహిళా శక్తిభవన్, గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన. ఇందుకోసం కుప్పం మండలం పలార్లపల్లెలో 19.87 ఎకరాల భూమి కేటాయింపు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, వారి సామాజిక ఆర్థికాభివృద్ధిని మెరుగుపరచడం, 175 మహిళా స్వయం సహాయక బృందాలకు మౌలిక సదుపాయాలపై శిక్షణ ఇచ్చి సామర్థ్యం పెంపుచేయడం, 4వేలమంది మహిళలకు ఉపాధి అవకాశాలను సృష్టించడం, 1900మంది సామాజిక స్థితిగతులను పెంచడం ఉద్దేశం.
- శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో కేటాయించిన 40 ఎకరాల భూమిలో రూ.233 కోట్లతో ఏర్పాటుచేయబోయే శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాలపొడి తయారీ)కి శంకుస్థాపన. దీని ద్వారా 4వేల మందికి ఉపాధి.
- కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్మాణంకోసం రూ.10 కోట్లతో నిర్మిస్తున్న రెండు అంతస్తుల కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ప్రారంభోత్సవం.
- కుప్పం మున్సిపాలిటీలో రూ.92కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం.
- కుప్పం మున్సిపాలిటీలో రూ.60.20 కోట్లతో చేపట్టనున్న డీకేపల్లె పార్కుతోపాటు ఉద్యాన వనాలు, రహదారులు, కూడళ్ల సుందీరకరణ చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవం.
- రూ.22 కోట్లతో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనానికి ప్రారంభోత్సవం.
- కుప్పం నియోజకవర్గ పరిధిలో రూ.110.21 కోట్లతో చేపట్టనున్న 451 మురుగు కాలువల పనులకు ప్రారంభోత్సవం.
- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 41,342 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాల కింద రూ.457.57 కోట్లు పంపిణీ.
- ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 71 మంది లబ్ధిదారులకు రూ.1.93 కోట్ల పంపిణీ.
- జిల్లా ఉద్యాన శాఖ సూక్ష్మ నీటిసాగు పథకం కింద 220 మంది రైతులకు రూ.4.220 కోట్ల విలువగల డ్రిప్పు పరికరాల పంపిణీ.
- యాంత్రీకరణలో భాగంగా ఐదుగురు రైతులకు 2.13 కోట్ల విలువైన మినీ ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాల పంపిణీ.
- బిగ్ బాస్కెట్ ప్రతినిధులతో చర్చలు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు గల అవకాశాలపై పరిశీలన. తద్వారా ఆర్గానిక్ రైతుల ఆర్థిక ఆదాయాన్ని పెంచే ప్రణాళికలు.
- ఈజీ మార్టు స్టాళ్ల సందర్శన. ఈ కంపెనీ ద్వారా కిరాణా దుకాణాల వ్యాపారాన్ని వృద్ధి చేసే చర్యలకు శ్రీకారం.



శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ప్రజా సేవకుడు శ్యామన్న

కుప్పం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీఆర్ శ్యామన్న ప్రజా సేవకుడని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. కుప్పం మండలం కంగుందిలో మంగళవారం రాత్రి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తండ్రి, మాజీ సర్పంచి శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంగుంది సర్పంచిగా 35 ఏళ్ల పాటు శ్యామన్న ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. పచ్చదనమన్నా, ప్రజలన్నా ఆయనకు ఎంతో ఇష్టమన్నారు. నిండుకాలం పాటు జీవించిన శ్యామన్న తనకు కూడా ఆత్మీయుడని చెప్పారు. కంగుంది అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. కంగుందినుంచి తిరిగి వస్తూ.. బైరుగానిపల్లెలోని గంగమ్మ గుడి మాజీ చైర్మన్ బీఎంకే రవిచంద్ర గృహానికి వెళ్లారు. త్వరలోనే వివాహం కానున్న ఆయన కుమార్తెను ఆశీర్వదించారు. తాను వివాహానికి రాలేనని, అందుకే ఇప్పుడే వచ్చి ఆశీర్వదిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాన అర్జీల్లో కొన్ని..

- తన భూమి 1.54 ఎకరాలను హంద్రీ-నీవా కాలువ కింద తీసుకున్నారని శాంతిపురం మండలం సోమాపురానికి చెందిన చలపతి అనే రైతు తెలిపారు. అయితే దీనికి ఇప్పటిదాకా నష్టపరిహారం అందలేదని ఫిర్యాదు చేశారు. మరోవైపు తాను తీసుకున్న రూ.50వేల వ్యవసాయ రుణం.. రూ.85 వేలకు చేరిందని, భూమి ఎక్కువ భాగం కాలువకు పోవడంతో రుణం కట్టలేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన 34 సెంట్లలో బోరు వేసుకున్నానని, దానికి పంప్‌సెట్ కావాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి.. చలపతి వ్యవసాయ రుణాన్ని రీ షెడ్యూల్ చేయాలని, ఆ డబ్బు కూడా తానే ఇస్తానని అధికారులకు సీఎం చెప్పారు. రెండ్రోజుల్లోగా ఆయన పొలానికి పంప్ సెట్ బిగించి.. పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- తమకున్న భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారని, అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఇలా పలువురు తమ సమస్యలపై ఆయనకు అర్జీలు సమర్పించారు.

చంద్రబాబు ఏమన్నారంటే..

కుప్పం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం పలుచోట్ల ఇటు అధికారులను, అటు పార్టీవారిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లారు. ఎక్కడెక్కడ ఆయన ఏమన్నారంటే..

నన్ను ఇంప్రెస్ చేయడానికి ప్రయత్నించవద్దు

జన నాయకుడు పోర్టల్ ఆవిష్కరించి కౌంటర్లలో అర్జీ ఫారాన్ని ముఖ్యమంత్రి చూస్తుండగా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల దాని గురించి వివరించబోయారు. 'కాసేపు ఉండు, నేను తెలుసుకుని రాష్ట్రమంతా అమలు చేయాలనుకుంటున్నాను. మీరు నన్ను ఇంప్రెస్ చేయడానికి ప్రయత్నించవద్దు' అని సున్నితంగా వారించారు. ఆన్‌లైన్‌లో నమోదు వంటి వివరాలు స్వయంగా కంప్యూటర్‌లో చూసి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఒక అర్జీదారుడి వివరాలను అప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయించి, అక్కడికక్కడే రూ.8లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు.

కార్యకర్త తీరుపై అసహనం

కౌంటర్‌లో కూర్చొన్న ఓ ఉద్యోగి విషయంలో పార్టీ కార్యకర్త జోక్యం చేసుకుని.. 'ఆ అమ్మాయిది మా ఊరే సార్' అని చెప్పబోయారు. దీనిపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'ఇక్కడ మీ ఊరు, మీవాళ్లు, వాళ్ల ఊరు, వాళ్లవాళ్లు అనే తేడా లేదు. అందరూ సమానమే. ఇలా చేసే మీరు ప్రజలతో సంబంధాలు కోల్పోయారు. ఇలా మాట్లాడితే మిమ్మల్ని పార్టీ ఆఫీసుకు కూడా రానివ్వను. మీకు నన్నే చుట్టుకోవడం, మీ పనులే చేసుకోవడం అలవాటు అయిపోయాయి. ఇలాగే నియోజకవర్గాన్ని చెడగొట్టుకున్నాం' అని మందలించారు.

కార్యకర్తలే నాకు ముఖ్యం

అంతకుముందు మీడియా సమావేశంలో పార్టీ కార్యకర్తలను కండువాలు తీయమంటూ సోలరైజేషన్ ప్రారంభోత్సవ సందర్భంలో కుప్పం ఎంపీడీవో చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించారు. తనకు కార్యకర్తలే ముఖ్యమని, వారు లేకుంటే తాను, పార్టీ లేదన్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. 'అధికారులు ఇప్పుడు వచ్చారు. కార్యకర్తలు ప్రతిపక్షంలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నా తరఫున, ప్రజల తరఫున నిలబడ్డారు. ఎందరో హత్యలకు గురయ్యారు. వారికివ్వాల్సిన గుర్తింపు వారికి ఇచ్చి తీర్చాల్సిందే. అధికారులు కూడా కార్యకర్తలను సమన్వయం చేసుకుని వెళ్లాలి' అని వ్యాఖ్యానించారు.

నేను నాయకులను చూడటానికి రాలేదు

ఎన్టీఆర్ స్టేడియం వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ.. నిలబడి ఉన్న నాయకులను చూసి అందరూ కూర్చోవాలని చెప్పారు. 'నేను నాయకులను చూడడానికి రాలేదు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి వచ్చాను. మీరు కొంచెం కూర్చొంటే ప్రజలకు నేను వివరిస్తాను.' అని వ్యాఖ్యానించారు.

నేడు సీఎం ఆకస్మిక తనిఖీ?

కుప్పం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీలకు దిగే అవకాశం ఉంది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఎం బుధవారం ఉదయం 8.30గంటలకు కుప్పం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లాలి. అయితే కుప్పం నుంచి బయల్దేరే షెడ్యూల్ 10.45 గంటలకు మారినట్లు తెలిసింది. దీంతో ఆయన అంతకుముందే కుప్పంలోని ఏదో ఒక వార్డును లేదా అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయం మంగళవారం రాత్రి బయటకు రావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రికిరాత్రి సిబ్బందిని రంగంలోకి దింపి వార్డుల్లో పారిశుధ్య, ఇతర పనులను చేయిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చివరి క్షణంలో తీసుకునే నిర్ణయాన్నిబట్టి తనిఖీలు ఉండేదీలేనిదీ తెలుస్తుందని అధికారవర్గాలు అంటున్నాయి.

అభివృద్ధి నిధుల వినియోగంపై విస్తృత తనిఖీలు



మంగళంపేట డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డాక్టర్ అరుణ జయమణి

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట గ్రామ పంచాయతీలో అభివృద్ధి నిధుల వినియోగంపై మంగళవారం హైదరాబాదుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ జయమణి విస్తృత తనిఖీలు చేపట్టారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం మంగళంపేట పంచాయతీకి ఉత్తమ అవార్డును ప్రకటించడంతోపాటు రూ.8 లక్షల నిధులను కేటాయించింది. ఈ నిధుల వినియోగం, పంచాయతీలో అభివృద్ధి పరిశీలనపై పర్యటించారు. ముందుగా డంపింగ్‌యార్డ్, హెల్త్ సెంటర్, అండర్ డ్రైనేజీ, ఉన్నత పాఠశాల, సచివాలయాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రం ప్రకటించిన నిధుల ఖర్చు, వాటి వినియోగం, అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్ బాబు, సర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రూ.2.20 లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్టు



గంజాయి, నిందితులను అరెస్టు చూపుతున్న ఒకటో పట్టణ సీఐ జయరామయ్య

చిత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రూ.2.20 లక్షల విలువచేసే 6.100 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఒకటవ పట్టణ సీఐ జయరామయ్య మంగళవారం సిబ్బందితో కలిసి మిట్టూరు పీజేఆర్ లైన్ వద్ద నిఘా పెట్టారు. ఈక్రమంలో శంకరయ్యగుంటకు చెందిన సునీల్‌కుమార్, జాన్సన్‌గార్డెకు చెందిన గౌస్‌బాషాలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.20 లక్షల విలువచేసే 6.100 కేజీల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ





పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు - అభ్యర్థుల కొలతలు చూస్తున్న పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు పెరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ 7వరోజు కూడా కొనసాగింది. మంగళవారం 610 మందికి గాను 379 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 192 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. ఎంపిక ప్రక్రియ ఇన్‌చార్జి ఎస్పీ రత్న పర్యవేక్షించారు. సర్టిఫికెట్ల పరిశీలన, దేహదారుఢ్య పరీక్షలనంతరం ఫిజికల్ సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. 192 మంది తదుపరి ప్రక్రియకు ఎంపికయ్యారు. 1600 మీటర్ల పరుగుపందెం, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌ను నిర్వహించారు. పరుగుపందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్పీ రత్న మాట్లాడుతూ కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందన్నారు. దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణన అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు

చిత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈనెల7వ తేదీ తుది గడువు ఉండేది. తాజా ఆదేశాల ప్రకారం ఈనెల 12 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. తర్వాత వీటిని ఈనెల 16వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. 20వ తేదీన కులగణన సర్వే వివరాలను సచివాలయాల వద్ద విడుదల చేస్తారన్నారు.

రసవత్తరంగా అంతర కళాశాలల క్రీడా పోటీలు



తిరుపతి రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా జరిగే 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు రెండవరోజు మంగళవారం రసవత్తరంగా సాగాయి. కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడల్లో తలపడ్డారు. అలాగే ఆడిటోరియంలో నిర్వహించిన సాహిత్య పోటీలలో పలువురు విద్యార్థులు శాస్త్రీయ, జానపద, సినీగీతాలకు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు.

వారి ఆయుధాలు వెనక్కి ఇచ్చేయండి

నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోండి ● పోలీసులకు హైకోర్టు ఆదేశం

● పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిల పిటిషన్లపై న్యాయస్థానం

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న లైసెన్స్ ఆయుధాలను వెనక్కి ఇచ్చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తీర్పు ప్రతి అందిన రెండువారాల్లో ఆయుధాలను అప్పగించాలని స్పష్టం చేసింది. ఆయుధాలు అప్పగించిన తరువాత పిటిషనర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొనేందుకు పోలీసులకు స్వేచ్ఛనిచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా తాను అప్పగించిన బోర్ పిస్టోల్, రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్‌ను వెనక్కి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాక కూడా ఆయుధాలను అధికారుల వద్దే ఉంచుకున్నారన్నారు. ఆయుధాలు తిరిగి ఇవ్వాలని వినతులు సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణహాని ఉన్న నేపథ్యంలో వాటిని వెనక్కి ఇచ్చేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

జోనల్ గేమ్స్‌లో సోమల విద్యార్థిని ప్రతిభ


ప్రథమ స్థానంలో నిలిచిన వసుంధరను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జోనల్ గేమ్స్‌లో భాగంగా జూనియర్ బాలికల అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో సోమల హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థిని వసుంధర ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ కరుణానిధి తెలిపారు. మంగళవారం పుదిపట్ల హైస్కూల్‌లో నియోజకవర్గం స్థాయిలో జరిగిన పరుగు పందెం పోటీల్లో వసుంధర విశేష ప్రతిభ కనబరచడంతో హెచ్‌ఎం హరినాథ్, ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, రామాంజులు, అరుణశ్రీ, షర్మిళభాను తదితరులు అభినందించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో పోకల తాతయ్య

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈవో పోకల తాతయ్య హెచ్చరించారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంతో పాటు నాణ్యంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం భోజనం తయారుచేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల తరగతులను పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, నిబంధనల ప్రకారం విద్యాబోధన అందించాలని తెలిపారు. హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలలో చలి మంటలు



సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తుంది. సోమల మండలంలోని అటవీ శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. వాహనాల ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. ఈక్రమంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. చలి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో చలి మంటలతో కనిపిస్తున్నారు.

కులగణనలో పొరబాట్లు సరిదిద్దాలి


తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో తప్పులున్నాయని.. పొరబాట్లు సరిదిద్దాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తహసీల్దారు బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ మాదిగని మాలగాను, మాలలను మాదిగలుగా నమోదు చేసి సచివాలయ నోటీసు బోర్డుల్లో అధికారిక ప్రకటనలు చేశారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మంద రామనాథం, జిల్లా నాయకులు మొగిలీశ్వర్, మండల అధ్యక్షుడు పి.ప్రకాశ్, రవికుమార్, మణికంఠ, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు మండల పూజలు


ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ చిన్నసోమల ప్రాథమిక పాఠశాల వద్ద నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళ వారం అమ్మవారికి మండల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను రామిశెట్టి రమణ, హరిముని వెంకటాచారి కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ సావిత్రమ్మ, వీవీ రమణ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, సాంబశివయ్య, జగదీశ్, జగన్, జ్యోతీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో మాట్లాడాలని తీసుకెళ్లి దాడి చేసి గాయపరిచారంటూ ఓ బాధితుడు మంగళవారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని రాంపల్లెలో కాపురం ఉన్న అజాంబాషా(27) వెల్డర్‌గా పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం బెంగళూరులో వెల్డింగ్ పరికరాల కోసం రూ. 50 వేలు తీసుకుని వెళ్లాడు. అయితే పరికరాల కొనుగోలుకు డబ్బులు చాలకపోవడంతో మళ్లీ కొనుగోలు చేయకుండా తిరిగి రాత్రి 12.30 గంటలకు ఓ ప్రైవేటు బస్సులో పుంగనూరు చేరుకుని ఆటోలో ఇంటికి వెళ్లాడు. అప్పటికే తన స్నేహితుడు ముజ్జు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావ్ అని ఆరా తీయగా తాను బెంగళూరు నుంచి వస్తున్నట్లు చెప్పడంతో ముజ్జు, అతని స్నేహితుడు ద్విచక్రవాహన మెకానిక్ నవాజ్‌లు మద్యం సేవించి తన కోసం ఎదురు చూస్తూ రోడ్డుపై ఉన్నారు. తాను ఆటో దిగిన వెంటనే ఈడిగపల్లె వద్ద స్నేహితులు ఉన్నారని, వెళ్లి వారితో మాట్లాడి వెంటనే తిరిగి వస్తామని నమ్మించి అక్కడకు వెళ్లగానే మరో ఇద్దరితో కలిసి తనపై దాడి చేసి గాయపరిచి రూ. 50 వేలు తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు.

రోడ్డుప్రమాదంలో అర్చకుడి మృతి


అర్చకుడు కల్యాణ్

బైరెడ్డిపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలార్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరెడ్డిపల్లెకు చెందిన అర్చకులు కల్యాణ్(25) మృతిచెందారు. స్థానిక కోదండ రామాలయం అర్చకులు తిప్పయ్యాచార్యులు కుమారుడు కల్యాణ్ కోలార్‌లో జరిగిన ఓ పూజా కార్యక్రమానికి వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతిచెందారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో
చిత్తూరుది మూడోస్థానం


కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిత్తూరు జట్టు

పుంగనూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు చిత్తూరు జిల్లా కబడ్డీ సంఘ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కర్నూలులో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జూనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన పుంగనూరు విద్యార్థులు గణేశ్, కార్తీక్, బాలికల విభాగంలో పెద్దపంజాణి మండలానికి చెందిన నేత్ర, చౌడేపల్లె మండలానికి చెందిన లిఖిత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

ప్రాంగణ ఎంపికలో ఎంవీఆర్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గంగవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 15 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో టెక్ మహేంద్ర కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రకటించారు. వీరికి ఏడాదికి రూ.2.5 లక్షల చొప్పున వేతనం అందుతుందని తెలిపారు.

పుంగనూరు సమస్యలపై విన్నవించా: చల్లా



పుంగనూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సోమవారం కలిసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని విన్నవించినట్లు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి సీఎంకు సమస్యలు విన్నవించానని.. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి.. అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారన్నారు. ప్రజలందరికీ తాను నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పేగలవారిపల్లె-చౌడేపల్లె మార్గంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న మోరీని ఢీకొన్న సంఘటనతో ఇద్దరు యువకులు గాయపడినట్లు సోమల ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. చౌడేపల్లెకు చెందిన రెడ్డిశేఖర్, హరి, భాను ద్విచక్రవాహనంలో కలికిరికి వెళ్లి దుస్తులు కొనుగోలు చేసి స్వగ్రామానికి వస్తుండగా పేగలవారిపల్లె అటవీ మార్గంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి మోరీని ఢీకొంది. ప్రమాదంలో రెడ్డిశేఖర్, భాను గాయపడ్డారు. రెడ్డిశేఖర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్‌కి తరలించారు. సోమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వల్లిగట్లలో పింఛన్ల తనిఖీలు

సోమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వల్లిగట్ల పంచాయతీలో రూ.15 వేలు పింఛను పొందుతున్న వారి వివరాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. చేపచిన్నఉప్పరపల్లె, నంజంపేటల్లో పింఛన్లు పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు. వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు.

జోనల్ పోటీల్లో విజేతలకు అభినందనలు


గెలుపొందిన రెడ్డిచరణ్, మనోజ్, సాద్విక్

చౌడేపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు జోనల్ పోటీలు జరిగాయి. 1500 మీటర్ల రన్నింగ్ సీనియర్ బాలుర విభాగంలో పుదిపట్ల హైస్కూల్ విద్యార్థి రెడ్డిచరణ్ మొదటిస్థానం, మనోజ్ రెండో స్థానం, సోమల హైస్కూల్‌కు చెందిన సాద్విక్ మూడో స్థానం సాధించినట్లు పీడీ వెంకటేష్ తెలిపారు. విద్యార్థులను ఎంఈవోలు కేశరెడ్డి, తిరుమలమ్మ, పీడీలు రాజేంద్ర, విశ్రాంతి పీడీ రామచంద్ర, హెచ్‌ఎం పద్మజ, ఉమా, శారద, నీలవేణి, మృదుల, నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, బాబురెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి అభినందించారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడాలని సీఎంకు వినతి

పుంగనూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రాంతంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సోమవారం రాత్రి కుప్పంలో సీఎం చంద్రబాబునాయుడుకు మైనార్టీ నాయకులు సుహేల్‌బాషా, నదీం, సద్దాంహుసేన్‌లు విన్నవించారు. సీఎం సానుకులంగా స్పందించారని తెలిపారు. నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు తమ భూములకు నష్టపరిహారం ఇప్పించాలని సీఎంను కోరారు. రైతులు కోలాట వెంకటరమణ, పులి వెంకటరమణ, సతీశ్, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రామాంజులు, వసంతరావ్, నరసింహులు సీఎంను కలిశారు.


రెవెన్యూ సదస్సులతో తక్షణ పరిష్కారం


లక్కునపల్లె సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవరాజు

పుంగనూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు డీటీ నాగేశ్వర్ తెలిపారు. మంగళవారం పుంగనూరు మండలం మాగాండ్లపల్లెలో నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి 11 వినతులు వచ్చినట్లు చెప్పారు. అందులో భూములు సర్వే చేసి సరిహద్దులు చూపాలని, రికార్డుల్లో పేర్లు మార్పు చేయాలని, తమ భూములకు 1(బి)లు రావడం లేదని తదితర సమస్యలపై వినతులు అందించారు. సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, డివిజన్ సర్వేయర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నాగభూషణంరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: భూసమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజు కోరారు. మండలంలోని లక్కునపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో సమస్యలపై రైతులు అర్జీలు అందించారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గంగవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పలమనేరులోని పెన్షనర్ల కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ నాయకుల అధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

కుప్పంలో జననాయకుడి సందడి




జననాయకుడు గ్రీవెన్‌సెల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, సీఎంకు హారతులిస్తున్న మహిళలు



ఎన్టీఆర్ స్టేడియంలో కళ్లజోడును బహూకరిస్తూ..


స్టాల్స్‌ను సందర్శిస్తూ..


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..



కుప్పం పార్టీ కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

తిరుమల పాదయాత్ర భక్తులకు అన్నదానం


కాలినడక భక్తులకు అన్నదానం చేస్తున్న శివకుమార్ తదితరులు


రొంపిచెర్లలో పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం నుంచి గోవిందమాల ధరించిన సుమారు 650 మంది పాదయాత్ర భక్తులకు మార్గమధ్యంలోని పులిచెర్ల మండలం చల్లావారిపల్లి వద్ద మంగళవారం గ్రామానికి చెందిన శివకుమార్ కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. గత నాలుగేళ్లుగా కాలినడకన వచ్చే భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా శివకుమార్ కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారు. శ్రీవారి భక్తులకు అన్నదానం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామని శివకుమార్ తెలిపారు. వీరితోపాటు నాదమునిరెడ్డి, ఎస్వీ రమణ, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు చింతపర్తి ఓబులేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పోతబోలు రామమూర్తి, భాస్కర్‌నాయుడు, ఉపాధ్యాయులు రమాపతి, తులసీరాం పిళ్లై, కృష్ణా మెడికల్స్ వారు మందులు, పండ్లు, వాటర్ బాటిళ్లు అందించారు. ధర్మవరం, బెంగళూరు, రాయచోటి, మదనపల్లె, గాలివీడు, పులివెందల, చింతామణి ప్రాంతాలకు చెందిన సుమారు 1500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఏటా పాదయాత్ర భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శివాలయ ధర్మకర్త చంద్రశేఖర్, వాటర్‌షెడ్ ఛైర్మన్ వరంపాటి అమరనాధరెడ్డి, పొన్నం వెంకట్రామ్, అమరనాధరెడ్డి, మదనగౌడ్ పాల్గొన్నారు.

తిరువణపల్లెలో ఇసుక అక్రమ రవాణా


తిరుణపల్లె చెరువులో ఇసుక తవ్వడంతో ఏర్పడిన గుంతలు


చౌడేపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరువణపల్లె సమీపంలోని గెన్నిపల్లె చెరువులో మంగళవారం ఉదయం కొందరు వ్యక్తులు ఇసుక అక్రమ రవాణా చేపట్టారు. జేసీబీతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించారు. ఈ విషయమై గ్రామస్తులు, టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్పీ, వీఆర్వోలు అక్కడికి వెళేలోపు జేసీబీ, 3 ట్రాక్టర్లు వెళ్లిపోయాయి. అధికారులే ముందుగా అక్రమార్కులకు సమాచారం అందించినట్లు గ్రామస్తులు ఆరోపించారు. తహసీల్దార్ హనుమంతును వివరణ కోరగా గ్రామస్తులు తమకు సమాచారం అందించగానే సిబ్బందిని పంపినట్లు తెలిపారు. అలాగే చెరువులోకి వాహనాలు వెళ్లకుండా కాలువ తీయించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వర్క్‌షాప్‌లు కీలకం


మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాప్‌పై విద్యార్థులు పట్టుసాధిస్తే సులభంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించడానికి దోహదపడుతుందని మదర్‌థెరిసా కళాశాల అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మదర్‌థెరిసా కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేదస్సు- డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ' డీప్ జనరేటివ్ లెర్నింగ్' అనే అంశంపై 5 రోజుల జాతీయ వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నమూనాల ప్రశ్నలకు సమాధానమివ్వడం, చిత్రాలను రూపొందించడం, కంటెంట్‌ను రాయడం లాంటివి వర్క్‌షాప్‌తో సులభంగా నేర్చుకోవచ్చున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, కళాశాల ఛైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్‌వోడీ లోకేష్, సీఈవో విజయ్‌పవన్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

గంగవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎస్ఈసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు పంచ, చీరకట్టు వస్త్రధారణతో హాజరయ్యారు. రంగురంగుల ముగ్గులు వేసి, పొంగళ్లు పెట్టారు. అనంతరం భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు షణ్ముగం, వాసు, చిదంబరం, నందీశ్వరయ్య, సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

రేపు బైరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు బెంగళూరు వైదేహి ఆస్పత్రి సహకారంతో ఎంఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగులు చాకచక్యంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎన్‌జీవో సంఘ పలమనేరు అధ్యక్షులు ఆనందబాబు

గంగవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెరుగుతున్న పని ఒత్తిడిని అధికమించాలంటే చాకచక్యంతో పనిచేయడం అలవాటు చేసుకోవాలని ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు ఎన్జీవో హోమ్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో టెక్నాలజీకి అనుగుణంగా ఉద్యోగులు పనిచేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఏపీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్, సంఘ నాయకులు జయమ్మ, సోమసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌రామ్ ప్రసాద్, రమణ, నాగేశ్వరి, షమీమ్, కుమార్ పాల్గొన్నారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

●సీఎం చంద్రబాబుకు రైతు నాయకుల వినతి



బంగారుపాళ్యం,జనవరి7(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల నుంచి పంటల పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అఖిలభారత రైతు కూలీ సంఘ నాయకులు ఉమాపతి నాయుడు,వెంకటరామిరెడ్డిలు కోరారు. మంగళవారం కుప్పంలో ఈమేరకు వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఏనుగు దాడులతో రైతుల పంటలను కోల్పోతున్నారన్నారు. పంటల రక్షణ సందర్భంలో రైతులపై దాడులు చేస్తున్నాయన్నారు. రైతులను చంపుతున్న సంఘటనలూ చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుప్పం, రామకుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపాళ్యం, పులిచెర్ల, ఐరాల తదితర ప్రాంతాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉందన్నారు. వీటి దాడులతో పంటను నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం అందించే నష్టం పరిహారం కూడా తక్కువగా ఉంటోందని ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాల్లో సోలార్, ట్రెంచ్‌లను ఏర్పాటు చేసి ఏనుగు దాడులను అరికట్టాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారని నాయకులు తెలిపారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన మురళి

శ్రీరంగరాజపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి) జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జాబ్‌కార్డు లేని వారికి కొత్తగా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగుతున్న వరి నాట్లు



తూరుపల్లిలో వరినాట్లు నాటుతున్న మహిళలు

పెనుమూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం అనుకూలించడం సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. చిన్న సన్నకారు రైతులు వరిసాగుకు ఉత్సాహపడుతున్నారు. మండలంలో ఇప్పటికే 184 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. మరో 70 ఎకరాలు నాట్లకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. పెట్టుబడి అధికమవుతున్నా పెరుగుతున్న బియ్యం ధరల దృష్ట్యా ఎక్కువ మంది రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు అవసరమైన ఎరువులకు సంబంధించి ఇండెంటు పంపారు. త్వరలో ఎరువులు అందుబాటులో ఉంటాయని అధికారులు చెప్పారు.

రీసర్వేలో తప్పులను సరిదిద్దడానికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్

గంగాధరనెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):రైతులు విజ్ఞప్తి మేరకే గత ప్రభుత్వ హయాంలో రీసర్వే కార్యక్రమంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గంగాధరనెల్లూరు స చివాలయంలో సర్పంచ్ సుబ్రమణ్యం అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే పేరుతో ఒక ప్రాంతాల్లోని సర్వేయర్లను మరొక ప్రాంతానికి పంపించి హడావుడిగా రీసర్వే చేయించడంవల్లే తప్పిదాలు జరిగాయన్నారు. మండల వ్యాప్తంగా 264 వినతిపత్రాలు వచ్చాయన్నారు. సమావేశంలో పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, పంచాయతీ కార్యదర్శి చంద్ర, పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** కొత్తపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రవింద్రబాబు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సర్వేయర్ సురేష్‌బాబు,టీడీపీ నాయకులు సూరిరెడ్డి,గురునాథం,యోగేశ్వర్ నాయుడు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు

వీఆర్వోతోనే రెవెన్యూ సదస్సు నిర్వహణ!



కొల్లాగుంట రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగరాజు

వెదురుకుప్పం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కేవీఎం అగ్రహారంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు వీఆర్వో శాంబశివారెడ్డితో సహా మరో ఇద్దరు చిరు ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. మూడు వినతి పత్రాలు వచ్చాయి. సదస్సుకు సంబంధిత ఉద్యోగులు హాజరు కాలేదని, గ్రామాల్లో దండోరా వేయడం లేదని కొందరు రైతులు నిరసించారు. ●కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో మంగళవారం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ స్వరూపారాణి హాజరయ్యారు. ఒక వినతిపత్రం అందినట్లు తహసీల్దార్ చెప్పారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రమిస్తున్న యూనియన్ నాయకులు

వెదురుకుప్పం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు రూ.26వేలు కనీసవేతనం ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత డిమాండ్ చేశారు. మంగళవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 18 ఏళ్లుగా సేవలందిస్తూ క్షేత్రస్థాయిలో పథకాల అమలులో కీలకభూమిక నిర్వర్తిస్తున్నారన్నారు. ఆశ వర్కర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నాయకులు జాన్సీ దేవకి, వసంత, భారతి, గుణవతి పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



బంగారుపాళ్యం,జనవరి7(ఆంధ్రజ్యోతి): మంగళ విద్యావాణి సంచికను విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి వాసుదేవనాయుడు మంగళపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని సంచికను ఆవిష్కరించామన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక సహకారం అందిస్తున్న ఎన్‌పి ధరణీ ప్రసాద్ నాయుడును అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మీ, అరుణశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఎలక్ట్రానిక్ వస్తువుల వేలం

చిత్తూరు సిటీ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎక్సైజ్ డిపోలో ఎలక్ట్రానిక్ వస్తువులు వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన 88 ఫ్రీజర్లు, 86 ఇన్వర్టర్‌లు, బ్యాటరీలు, 108 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 41 క్యాష్ చెస్ట్‌లు, 174 స్కానర్లు వేలం వేస్తామన్నారు. ఈనెల 11వ తేది ఉదయం 10 గంటలకు పూతలపట్టు సమీపంలోని వడ్డేపల్లి సమీపంలోని ఎక్సైజ్ డిపోలో బహిరంగ వేలం వేస్తారన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9177887729, 7780566131, 9949351040 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఏఐతో ఉపాధి అవకాశాలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏఐతో విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని ఎన్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర అన్నారు. కళాశాలలో ఏఐపై నిర్వహించిన సెమినార్ మంగళవారం ముగిసింది. అన్ని రంగాల్లో ఏఐ పాత్ర ప్రాధాన్యతను వక్తలు వివరించారు. భవిష్యత్ తరాలకు కృత్రిమ మేధస్సు రంగంలోనే ఉద్యోగ అవకాశాలుంటాయని వివరించారు. విద్యార్థినులు ఈ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అయ్యప్పన్, గోపి, శ్రీరామన్, సీడాప్ డీఎం సరితారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 10మందికి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. 10మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వీరిని మంగళవారం జిల్లాజడ్జి ఉమాదేవి ముందు ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేసినట్లు సీఐ తెలిపారు. గడచిన 12 నెలల వ్యవధిలో 677 మందికి రూ.67.70 లక్షలు జరిమానా విధించారు.

వరసిద్ధుని సేవలో సినీ నిర్మాత బెల్లంకొండ



ఐరాల(కాణిపాకం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ మంగళవారం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు,తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

రోడ్డుప్రమాదంలో అర్చకుడి మృతి



కల్యాణ్(ఫైల్‌ఫొటో)

బైరెడ్డిపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలార్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరెడ్డిపల్లెకు చెందిన అర్చకులు కల్యాణ్(25) మృతిచెందారు. స్థానిక కోదండ రామాలయం అర్చకులు తిప్పయ్యాచార్యులు కుమారుడు కల్యాణ్ కోలార్‌లో జరిగిన ఓ పూజా కార్యక్రమానికి వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతిచెందారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

రేపు బైరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు బెంగళూరు వైదేహి ఆస్పత్రి సహకారంతో ఎంఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

శ్రీరంగరాజపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి) ఆయిల్ పామ్ సాగు రైతులకు వరమని అమృత పామ్ ప్లాంటేషన్స్ సీఈవో రంగనాయకులు తెలిపారు. మంగళవారం నెలవాయి రైతు భరోసా కేంద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అమ్మ పామ్ ద్వారా ఉచితంగా మొక్కలు అందజేస్తామన్నారు. మిగతా పంటలతో పోలిస్తే వచ్చే దిగుబడి,గతంలో సాగు చేసిన రైతుల అనుభవాలపై ఆయన స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి లోకేష్, అమ్మ ఆయిల్ పామ్ ప్రతినిధి మహేష్, రైతు రఘుపతి నాయుడు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

'ఆశా'ల హామీలను నెరవేర్చాలి

నగరి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరై కోరారు. ఈమేరకు ఆమె మంగళవారం వైద్యాధికారి రమేష్‌ను ఆశా వర్కర్లతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. యూనియన్ నాయకులు రూప, విజయలక్ష్మి,జయప్రదలు పాల్గొన్నారు. **విజయపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సోమశేఖర్‌కు ఆశా వర్కర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ26 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు లతలక్ష్మి, షీబా, గీత, రేవతి, మంజుల పాల్గొన్నారు.

శిథిలమైన తాగునీటి ట్యాంకులతో తిప్పలు



పెచ్చులూడిపోతున్న పెద్ద ట్యాంక్ పునాది పిల్లర్



ఎగువూరులో నిరుపయోగంగా పాత తాగునీటి ట్యాంక్

గంగాధరనెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. 45 ఏళ్ళ క్రితం ఎంపీడీవో ఆఫీస్ వెనుక భాగంలో 20వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించారు. జనాభా పెరగడంతో 20 ఏళ్ల క్రితం 40వేల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంక్ నిర్మించారు. దీంతో వివిధ ప్రాంతాలకు వేర్వేరు సమయాల్లో నీటిని సరఫరా చేసేవారు. దళితవాడ ప్రజలకు ఇబ్బంది కలగడంతో తర్వాత ప్రాథమిక పాఠశాలకు సమీపాన 20వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మించారు. తొలిసారి నిర్మించిన పాత ట్యాంక్ పైభాగం, లోపల సిమెంట్ పెచ్చులు ఊడిపోయి కమ్మీలు కనిపిస్తున్నాయి. పైపులు కూడా దెబ్బతిన్నాయి. ఈ ట్యాంక్ నిరుపయోగమైంది. రెండో ట్యాంకు పైభాగం బీటలు వారింది. నీరు లీకవుతోంది. పునాది వద్ద పెచ్చులూడిపోతున్నాయి. నిచ్చెన తుప్పు పట్టిపోయింది. మొదటి ట్యాంక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని 1.50లక్షల సామర్థ్యమున్న ట్యాంక్ నిర్మించాల్సిన అవసరముంది. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు తహసీల్దార్ నోటీసులపై కలకలం

వెదురుకుప్పం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇరిగేషన్ ఏఈ, పోలీసుస్టేషన్ హౌస్ ఆఫీసర్, మాంబేడు పంచాయతీ సెక్రటరీలకు తహసీల్దార్ రమేష్‌బాబు మంగళవారం నోటీసులు పంపడం అధికారవర్గాల్లో చర్చనీయాంశమైంది. మాంబేడులోని సర్వే నంబరు 81/2లో తమ వ్యవసాయ భూములకు వెళ్లే దారిని అదే గ్రామానికి చెందిన బి.సుబ్రహ్మణ్యంరెడ్డి,బోడిరెడ్డి లంబోదరరెడ్డిలు మూసివేశారని గ్రామ కాలనీకి చెందిన మహాలక్ష్మి తహసీల్దారుకు గతంలో తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 304/5, సర్వే నంబరు 304/4లోని తమ భూమిలో చింత, టేకు చెట్లను నరికి వేశారని పేర్కొంది. వ్యవసాయ భూమి దారిని, కుంటను పునరుద్ధరించాలని ఆమె కోరింది. ఈ ఫిర్యాదుకు సంబంధించి ఇప్పటివరకూ చర్యలు ఎందుకు తీసుకోలేదో వివరించాలని ఇరిగేషన్ ఏఈకి తహసీల్దార్ తాజాగా నోటీసు పంపారు. ఈ అంశంపై విచారించి చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసరుకు కూడా ఆయన నోటీసు ఇచ్చారు. ఫిర్యాదుపై స్పందించనందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పంచాయతీ సెక్రటరీకి కూడా తహసీల్దార్ నోటీసు పంపించారు. ఈనోటీసుల వ్యవహారం కలకలం రేపింది. తహసీల్దార్‌కు నోటీసు పంపే అధికారం ఉందా? లేదా అనే అంశంపై చర్చ నడుస్తోంది.

వైభవంగా పిండి దీపోత్సవం



నగరి, జనవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోవిందమాల భక్తబృందం మంగళవారం పిండిదీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆంజనేయస్వామి ఆలయం నుంచి పిండిదీపం వెలిగించుకుని గోవిందనామ స్మరణతో కరియమానిక్యస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు నాట్యం చేస్తూ గోవింద భజనలు చేశారు. ఆలయానికి పిండి దీపం చేరుకున్నాక భక్తులు ఎగబడ్డారు. పిండి ప్రసాదాన్ని తీసుకెళ్లారు.

సహకార ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న విజయకుమార్

గంగాధరనెల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సహకార సింగిల్ విండో సొసైటీ ఉద్యోగస్థులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సింగిల్‌విండో సొసైటీ ఉద్యోగస్థుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి కోరారు. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడుకు ఆయన మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు రిటైర్మెంట్ వయోపరిమితి 62 ఏళ్ళకు పెంచాలని కోరారు. 2019 మార్చి తర్వాత చేరిన సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పిస్తూ జీత భత్యాలు ఇప్పించాలన్నారు. దీనిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని పీఎస్ ప్రద్యుమ్నను సీఎం ఆదేశించారన్నారు. యూనియన్ నాయకులు రమేష్, కలవకుంట మునస్వామి, రామ్మూర్తి, శివారెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా 'జన నాయకుడు' : ఎంపీ దగ్గుమళ్ళ



'జన నాయకుడు' ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జనవరి 7:సీఎం చంద్రబాబు నాయుడు కుప్పంలో సోమవారం ప్రారంభించిన 'జన నాయకుడు' కార్యక్రమం రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం మరో ప్రయోగాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. నిత్యం ప్రజా శ్రేయస్సే ప్రథమ కర్తవ్యంగా భావించి పనిచేస్తున్నారన్నారు. వినూత్న ఆలోచనలతో కుప్పంను ప్రయోగాలకు కేంద్ర బిందువుగా మార్చుతున్నారని కొనియాడారు. 'జన నాయకుడు' కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

●సీఎం చంద్రబాబుకు రైతు నాయకుల వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు కూలీ సంఘ నాయకులు

బంగారుపాళ్యం,జనవరి7(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల నుంచి పంటల పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అఖిలభారత రైతు కూలీ సంఘ నాయకులు ఉమాపతి నాయుడు,వెంకటరామిరెడ్డిలు కోరారు. మంగళవారం కుప్పంలో ఈమేరకు వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఏనుగు దాడులతో రైతుల పంటలను కోల్పోతున్నారన్నారు. పంటల రక్షణ సందర్భంలో రైతులపై దాడులు చేస్తున్నాయన్నారు. రైతులను చంపుతున్న సంఘటనలూ చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుప్పం, రామకుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపాళ్యం, పులిచెర్ల, ఐరాల తదితర ప్రాంతాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉందన్నారు. వీటి దాడులతో పంటను నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం అందించే నష్టం పరిహారం కూడా తక్కువగా ఉంటోందని ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాల్లో సోలార్, ట్రెంచ్‌లను ఏర్పాటు చేసి ఏనుగు దాడులను అరికట్టాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారని రైతుల నాయకులు తెలిపారు.

జగన్ వల్లే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం: బీజేపీ

పూతలపట్టు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయంలోనే విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడిందని మండల బీజేపీ అధ్యక్షుడు ఎం. ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని గుర్తుంచుకోవాలన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు.

సుబ్రమణ్యేశ్వరుడికి ...

కార్వేటినగరంలోని కుమారగిరిపై వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు.

రెవెన్యూ సదస్సుకు 10 వినతులు

బంగారుపాళ్యం,జనవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుపల్లి,వేపనపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. రైతుల నుంచి 10 వినతులను స్వీకరించినట్లు ఆర్‌ఎస్ డీటి బాబు తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ లావణ్య,వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజేంద్ర



విజయపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవోగా రాజేంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీవో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు మూడోస్థానం

పుంగనూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు చిత్తూరు జిల్లా కబడ్డీ సంఘ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కర్నూలులో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జూనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన పుంగనూరు విద్యార్థులు గణేశ్, కార్తీక్, బాలికల విభాగంలో పెద్దపంజాణి మండలానికి చెందిన నేత్ర, చౌడేపల్లె మండలానికి చెందిన లిఖిత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

రోడ్లు ఇలా ఉంటే రాకపోకలు సాగించేదెలా?





చిత్తూరు- అరగొండ మార్గంలో సంతపల్లె- ఉత్తరబ్రాహణపల్లె వద్ద గుంతలమయమైన రోడ్డు

తవణంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-అరగొండ రహదారిలో గత నెలలో కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అర్ధగిరి, కాణిపాకం, తిరుమల, కాళహస్తికి నిత్యం వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరులోని పాఠశాలలు, కళాశాలల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. సంత్తపల్లె, ద్వారకాపురం, ఉత్తరబ్రాహ్మణపల్లె రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి పూట ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.